క్లుప్తంగా

న్యాయవాదుల సంఘ అధ్యక్షుడిగా తిరుపతిరావు



కొలువుదీరిన నూతన సభ్యులు

సాలూరు: న్యాయవాదుల సంఘ అధ్యక్షుడిగా తాడ్డి తిరుపతిరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఎన్నికలో జనరల్ సెక్రటరీగా బొత్స శ్రీనివాస్, ట్రెజరర్‌గా రావాడ రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా వేణుగోపాలరావు, జాయింట్ సెక్రటరిగా బందాపు కూర్మరావు, లైబ్రరీ సెక్రటరీగా శంకరరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ, బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామన్నారు.

నేడు శిక్షణ సమావేశం

సాలూరు: ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించి ఆదివారం స్థానిక ఫిలడెల్ఫియా కమ్యూనిటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి పీడిక రాజన్నదొర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. సమావేశానికి నియోజకవర్గంలోని పట్టణ, మండల సీనియర్ నాయకులు, జేసీఎస్ మండల, పట్టణ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు హాజరుకావాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర హాజరవుతారని తెలిపారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎంఈఓ రాజ్‌కుమార్

సాలూరు: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ రాజ్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్ష కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా కేంద్రాల్లో బాలురు 668 మంది, బాలికలు 711 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. సోమవారం నుంచి ఈ నెల 18 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: మండలంలోని జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులను ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ కోరారు. పెదబోగిలి పంచాయతీ అప్పయ్యపేట జగనన్న లేఅవుట్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలను హౌసింగ్ ఏఈ జానకీరామ్, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు సంతోష్‌కుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని ప్రభుత్వం రాయితీపై అందిస్తోందని, లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. నిర్మాణాలు పూర్తిచేసిన వారికి సకాలంలో బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ కె.నీలకంఠం

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ కె.నీలకంఠం కోరారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడటం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతి వేగంతో ప్రయాణించడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల అధికంగా రోడ్డు ప్రమాణాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతీ శనివారం నో యాక్సిడెంట్ డేగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పెదమరికి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పార్వతీపురం: పెదమరికి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై పంచాయతీ కార్యదర్శి ఎస్వీ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసినట్లు డీపీఓ బి.సత్యన్నారాయణ శనివారం తెలిపారు. అలాగే గ్రామ సర్పంచ్ హెచ్ గంగ చెక్ పవర్‌ను నియంత్రణ చేసినట్లు చెప్పారు.

రైతన్న నడ్డి విరిచిన అకాల వర్షం

- నష్టపోయిన పంటలను పరిశీలించిన ఉద్యానవన శాఖాధికారులు
- బొడ్డుసామంతవలసలో ఇళ్లపై పడిన భారీవృక్షం



గైశీల గ్రామం వద్ద నేలరాలిన లేత జీడిపిక్కలు

మక్కువ:

మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలన్నీ నేలమట్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బలమైన ఈదుగాలులకు జీడి, అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. పెద్ద పెద్ద చెట్లు రహదారులుకు అడ్డంగా, ఇళ్లపై విరిగిపడ్డాయి. మండలంలోని కొండబుచ్చమ్మపేట, పెదగైశీల, మార్కొండపుట్టి, బొడ్డుసామంతవలసలో ఈదురుగాలుల వర్షం బీభత్సం సృష్టించింది.

పంటల పరిశీలన

మండలంలోని పెదగైశీల గ్రామానికి చెందిన కరుటూరి మురళీకృష్ణ అనే రైతుకు చెందిన జీడితోట నేలకొరిగింది. ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష, తదితరులు శనివారం గ్రామానికి చేరుకుని జీడితోటను పరిశీలించారు. 3.8 ఎకరాల్లో 40 జీడిచెట్లు నేలకొరిగినట్లు గుర్తించారు. అలాగే మరో 20 జీడి చెట్లు సగం వరకు ఒరిగినట్లు గుర్తించారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలో 102 మంది రైతులుకు చెందిన సుమారు 160 ఎకరాల్లో అరటి పంట నేలకొరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. కొండబుచ్చమ్మపేట, సరాయివలస గ్రామాలలో నేలకొరిగిన మొక్కొజొన్న పంటను ఏఓ శ్రీనివాస రావు పరిశీలించారు.



నేలకొరిగిన జీడిచెట్లను పరిశీలిస్తున్న హెచ్ఓ ప్రత్యూష



బొడ్డుసామంతవలసలో ఇళ్లపై కూలిన భారీవృక్షం

ఇళ్లపై కూలిన భారీవృక్షం..

మార్కొండపుట్టి పంచాయతీ బొడ్డుసామంతవలస గ్రామంలో నాలుగు ఇళ్లు, ఒక దుకాణంపై భారీవృక్షం కూలిపోయింది. అయితే అదృష్టవశాత్తూ ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. వర్షానికి మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో ఏఈ శాంతారావు ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ సిబ్బంది శుక్రవారం రాత్రి నుంచి మరమ్మతులు చేపడుతున్నారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం



ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98.4 శాతం అమలు
- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98.4% నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని జమదాల గ్రామంలో శనివారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా స్థానిక సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అవకాశం లభించిందన్నారు. సచివాలయం పరిధిలో సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు కేటాయించినట్లు చెప్పారు.

ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మరు

ప్రతీ కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందజేస్తూ..పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాధారణను చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. వారే ఇప్పుడు ఎల్లో మీడియాతో కలిసి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు వారి మాటలను నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శిద్దా జగన్నాథరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం అమలుపై దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి సమావేశాలు నిర్వహించాలన్నారు. 7 నుంచి 14 వరకు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాలను, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలని సూచించారు.

అసరా సదస్సును జయప్రదం చేయాలి

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉదయం నిర్వహించే 'వైఎస్సార్ ఆసరా' సంబరాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు. మహిళా సంఘాల లబ్ధిదారులంతా కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ క్రిష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతిరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7 నుంచి చేపట్టనున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్ దిశానిర్దేశం చేశారు. మండలంలోని పెదమరికి, కృష్ణపల్లి, లక్ష్మీనారాయణపురం, సంగంవలస సచివాలయ పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లుతో శనివారం సమావేశాలు ఏర్పాటు చేశారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, జెట్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, చినబొండపల్లి ఎంపీటీసీ బంకూరు రవికుమార్, కాపారపు సత్యనారాయణ, వెంపల గుర్రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక స్థితికి అనుగుణంగా బోధన

సీతానగరం:



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు ఎస్.గీత

విద్యార్థుల మానసిక స్థితికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సమగ్రశిక్ష రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎగ్జామినేషన్స్ రాష్ట్ర పరిశీలకులు ఎస్.గీత అన్నారు. మండలంలోని జోగింపేట కేజీబీవీని శనివారం ఆమె సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విజయనగరం జీసీడీఓ కె.రోజారాణి, కేజీబీవీ సూపర్‌వైజర్ జి.హరిత ఉన్నారు.

స్పాన్సర్లకు ఆహ్వానం

పార్వతీపురం: మిషన్ వాత్సల్య స్కీంలో భాగంగా స్పాన్సర్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా నిరాదరణకు గురైన బాలలకు విద్య, ఆరోగ్యం, అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడే విధంగా ఆర్థికంగా ఆదుకోవడానికి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితికి అనుబంధంగా షరతులతో కూడిన సహాయంను అందించడం జరుగుతుందన్నారు. స్పాన్సర్‌షిప్ ద్వారా ఎంపికైన పిల్లలకు నెలకు రూ.4 వేలు అందించడం జరుగుతుందన్నారు. చదువుకునే పిల్లలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. అర్హులైన పిల్లల వివరాలతో పూర్తిచేసిన దరఖాస్తుతో పాటు ధ్రువపత్రాలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గాని, ఐసీడీఎస్ కేంద్రంలో గాని సంప్రదించాలని సూచించారు.

డీఈఓ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురంటౌన్: విద్యార్థులు పఠనా శైలిని పెంపొందించుకోవాలని డీఈఓ ఎస్‌డీవీ రమణ అన్నారు. పార్వతీపురం కేపీఎంహెచ్ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షలు బాగా రాయాలని, వందశాతం ఉత్తీర్ణత సాధించాలని పదోతరగతి విద్యార్థులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వండి పెట్టాలని సూచించారు.

పోడు పట్టాల పంపిణీకి చర్యలు

సీతానగరం: దీర్ఘకాలంగా పోడుభూముల్లో సాగుచేస్తున్న రైతులకు ఎస్టిమెంట్ కమిటీ ద్వారా హక్కుపత్రాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో సాగుచేస్తున్న రైతులకు హక్కు పత్రాల పంపిణీపై తహసీల్దార్ ఎస్.వి.రమణతో శనివారం సమీక్షించారు. జగనన్న సమగ్ర భూహక్కు, భూరక్ష పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న రీసర్వే వేగవంతం చేయాలని, సర్వేలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. దీర్ఘకాలంగా రైతుల స్వాధీనంలో ఉన్న పోడుభూముల వివరాలు అందివ్వాలని కోరారు. అలాగే వెంకటాపురంలో 2.25 ఎకరాల భూమి పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



డీఈఓకు తమ సమస్యలు చెపుతున్న సీఆర్టీలు

పార్వతీపురం టౌన్: సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న గెస్ట్ సీఆర్టీలు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. తమ పనితీరును గుర్తించి రెన్యూవల్ చేయాలని కోరారు.

లక్ష్యాలు పూర్తి చేయండి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: గృహ నిర్మాణాల లక్ష్యాలను కచ్చితంగా పూర్తి చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, సాలూరు హౌసింగ్ ప్రత్యేక అధికారి సి. విష్ణు చరణ్ అన్నారు. సాలూరు మున్సిపాలిటీ, మండలంలో జరుగుతున్న గృహనిర్మాణాలపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహనిర్మాణాలను వేగవంతం చేసేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు రోజువారీ ప్రాతిపదికన లక్ష్యాలను నిర్ణయించారు. గృహ నిర్మాణాలు మొదలుపెట్టేలా లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ హెచ్. శంకరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అర్బన్, రూరల్ గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజినీర్, ఇంజినీరింగ్ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా పనిచేయాలి



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సీతానగరం: గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు పనులు చేపట్టాలని ఎంపీడీఓ ఎం.ఎల్.ఎస్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ అధికారిగా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడంపై దృష్టి సారించాలన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించే ఆసరా సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

మాతాశిశు ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఐఓ జగన్‌మోహనరావు

సీతానగరం: జిల్లాలో మాతాశిశు ఆరోగ్య భద్రతకు వైద్య సిబ్బంది అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ) అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కె.ఎస్.పురం, చినబోగిలి, పెదబోగిలి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన తల్లీబిడ్డల సంరక్షణ కార్డులు, పిల్లల టీకా కార్డుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫోలిక్‌యాసిడ్ మాత్రలు, ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు, పౌష్టికాహారం ద్వారా రక్తహీనతను నివారించవన్నారు. పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్, సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపరువైజరు కె.సత్యవతి, జయాగౌడ్, అంగన్‌వాడీ టీచర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో రైతులకు న్యాయం



రీసర్వే వివరాలు పరిశీలిస్తున్న డీటీ చిట్టమ్మ

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాకరంగా అమలు చేస్తున్న జగనన్న సమగ్ర భూసర్వేతో రైతులకు న్యాయం జరుగుతుందని మండల రీసర్వే డీటీ పి.చిట్టమ్మ అన్నారు. మండలంలోని రామవరంలో జరుగుతున్న భూముల రీసర్వేను మండల సర్వేయర్ గౌరీశంకరరావు, సచివాలయ సర్వేయర్లు శనివారం పరిశీలించారు. ప్రభుత్వ భూములు, రైతుల జిరాయితీ భూముల సరిహద్దులను గుర్తించడంతో పాటు ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చడం, తప్పులు సరిచేయడం వంటివి చేపట్టనున్నట్లు చెప్పారు. వందేళ్లుగా భూముల సర్వే చేపట్టకపోవడంతో రైతులు భూముల క్రయవిక్రయాల సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రీసర్వేతో వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. 8 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, రైతులకు హక్కుపత్రాలు పంపిణీకి సిద్ధం చేస్తున్నామన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాల్సిందే..



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, సీతారాం కోరారు. పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద శనివారం 'నో యాక్సిడెంట్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, అధిక వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సైన్‌బోర్డులపై అవగాహన కల్పించారు. సరుకురావాణా వాహనాల్లో ప్రయాణికులను తరలించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



గాదెలవలస వద్ద విరిగిన విద్యుత్ స్తంభం



జానుమల్లువలస వద్ద నేలకొరిగిన 11కేవీ విద్యుత్ స్తంభం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగడంతో గాదెలవలస, జానుమల్లువలస, పూనుబుచ్చింపేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని ఏఈ సోమేశ్వరరావు తెలిపారు. ఈదురుగాలులకు పలుచోట్ల 18 స్తంభాలు విరిగినట్లు సమాచారం అందినట్లు చెప్పారు. వాటిని సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు సిబ్బంది కృషిచేస్తున్నారన్నారు. అలాగే జానుమల్లువలస, కె.ఎస్.పురం, గాదెలవలస రెవెన్యూ పరిధిలో మామిడి తోటల్లో పక్వదశకు వచ్చిన కాయలు నేలరాలడంతో మామిడి రైతులు లోబోదిబో మంటున్నారు.